క్లుప్తంగా

అప్పన్న రథం సామర్థ్యం పరిశీలన



రథాన్ని పరిశీలిస్తున్న ఆర్ అండ్ బీ ఈఈ రమేష్‌కుమార్, తదితరులు

సింహాచలం: వచ్చే నెల 2న జరిగే శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి వార్షిక కల్యాణోత్సవంలో భాగంగా నిర్వహించే రథోత్సవానికి సంబంధించి రథం సామర్థ్యాన్ని ఆర్ అండ్ బీ ఇంజినీరింగ్ అధికారులు గురువారం పరిశీలించారు. ఆ రోజు సింహగిరి మాడ వీధుల్లో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని రథాన్ని లాగుతుంటారు. దీనిలో భాగంగా ఏటా రథం సామర్థ్యాన్ని ఆర్ అండ్‌బీ ఇంజినీరింగ్ అధికారులు పరిశీలించి సర్టిఫై చేస్తారు. ఈ తరుణంలో సింహగిరికి వచ్చిన ఆర్ అండ్ బీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రమేష్‌కుమార్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సత్యపణేశ్వర్.. రథాన్ని పరిశీలించారు. చక్రాలు, స్టీరింగ్, బొడ్డుబల్ల, తాళ్లు, తదితర వాటిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. రథోత్సవంలో పాటించాల్సిన జాగ్రత్తలను దేవస్థానం ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబుకు తెలియజేశారు.

కోడిపందాలు ఆడుతున్న నలుగురిపై కేసు

సబ్బవరం: మండలంలోని అయ్యన్నపాలెం శివార్లలో గురువారం సాయంత్రం కోడిపందేలు నిర్వహిస్తున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ రంగనాథం తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు తమ సిబ్బంది నిర్వహించిన దాడుల్లో వీరి నుంచి 5 కోడి పుంజులతో పాటు రూ.1,020 స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వీరిపై కేసు నమోదు చేసి, కోర్టులో హాజరు పరచనున్నట్లు తెలియజేశారు.

చీమలాపల్లిలో..

సింహాచలం: పెందుర్తి మండలం చీమలాపల్లిలో కోడిపందాలు ఆడుతున్న 9 మందిని పెందుర్తి పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. చీమలాపల్లిలో పెద్ద ఎత్తున కోడి పందాలు ఆడుతున్నట్టు అందిన సమాచారం మేరకు పోలీసులు గురువారం దాడులు చేశారు. 9 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.8వేలు నగదు, ఏడు ద్విచక్ర వాహనాలు, తొమ్మిది మొబైల్ ఫోన్లు, రెండు పందెం కోడి పుంజలను స్వాధీనం చేసుకున్నారు.

కల్యాణోత్సవంలో మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న సొసైటీ సిబ్బంది

సబ్బవరం: స్థానిక కోదండ సీతారామాలయంలో నిర్వహించిన స్వామి వారి కల్యాణ మహోత్సవంలో జాగృతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం మజ్జిగ పంపిణీ చేశారు. దివంగత కందర్ప రామకృష్ణ జ్ఞాపకార్థం జాగృతి సొసైటీ మేనేజింగ్ డైరెక్టర్ కందర్ప సుజాత చేతుల మీదగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్వామివారి కల్యాణంలో పాల్గొన్న సుమారు 1,800 మందికి మజ్జిగ అందించినట్లు సొసైటీ సభ్యులు తెలిపారు. సొసైటీ పాలకవర్గ సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బైక్ ఢీకొని ఇద్దరికి గాయాలు

బీచ్ రోడ్డు: ద్విచక్ర వాహనం ఢీకొని ఇద్దరు గాయాలు పాలయ్యారు. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. గురువారం సాయంత్రం ఏయూ మెయిన్ గేట్ వద్ద రోడ్డు దాటుతున్న ఒక మహిళ, మరో వ్యక్తిని సిరిపురం వైపు బైక్‌పై వెళ్తున్న యువకుడు ఢీకొట్టాడు. దీంతో ఆ ఇద్దరికి తీవ్ర గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు. ద్విచక్ర వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

1న మానవహారం

సీతంపేట: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఏప్రిల్ 1న నగరంలో నిర్వహించనున్న మానవహారంలో కార్మికులు, ప్రజానీకం పాల్గొని బీజేపీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు జి.వామనమూర్తి పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలో కొనసాగించాలంటూ నరసింహనగర్ జాతీయ రహదారి వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద కొనసాగుతున్న నిరసన దీక్షలకు ఏప్రిల్ 1 నాటికి రెండేళ్లు పూర్తవుతాయన్నారు.



తానాం రామాలయంలో ప్రత్యేక అలంకరణలో సీతారామ లక్ష్మణులు



రావలమ్మపాలెంలో అన్నసమారాధనలో పాల్గొన్న త్రినాథ రామకాసు తదితరులు



గుల్లేపల్లిలో కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎంపీపీ సూర్యకుమారి దంపతులు



మల్లునాయుడుపాలెంలో స్వామి వారి కల్యాణంలో పాల్గొన్న పలువురు దంపతులు



అడవివరంలోని రాజవీధిలో సీతారాముల కల్యాణోత్సవంలో పాల్గొన్న గంట్ల శ్రీనుబాబు



చినముషిడివాడ శాంతినగరంలో భక్తులకు అన్న ప్రసాదం వడ్డిస్తున్న కార్పొరేటర్ శానాపతి వసంత

కనులపండువగా సీతారాముల కల్యాణం



సింహగిరిపై సీతారాముల కల్యాణోత్సవంలో భాగంగా తలంబ్రాలు ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు



కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు



ఆదిరెడ్డిపాలెంలో ఉత్సవంలో పాల్గొన్న కోటాన రాము, గ్రామ పెద్దలు



రాయపుర అగ్రహారంలో పరిణయ వేడుకలో పాల్గొన్న పలువురు దంపతులు, భక్తులు

సింహాచలం: శ్రీరామనవమి సందర్భంగా సింహగిరిపై ఉన్న పురాతన రామాలయంలో గురువారం సీతారాముల కల్యాణోత్సవం కనుల పండువగా జరిగింది. భక్తులు తరలివచ్చి స్వామివారి కల్యాణోత్సవాన్ని కనులారా తిలకించారు. భక్తిపారవశ్యంలో మునిగితేలారు. ఆలయ ప్రాంగణంలోని మండపంలో సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయస్వామివారి ఉత్సవమూర్తులను అధిష్ఠింపజేసి, విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు చిన్నా, శ్రావణ్ తదితరులు ఈ కార్యక్రమాన్ని జరిపారు. భక్తులకు స్వామివారి కల్యాణ అక్షింతలు, ప్రసాదం అందజేశారు. దేవస్థానం పూర్వ అనువంశిక ధర్మకర్త దివంగత పూసపాటి ఆనందగజపతిరాజు సతీమణి సుధాగజపతిరాజు, ట్రస్ట్ బోర్డు సభ్యులు వారణాసి దినేష్‌రాజ్, దశమంతుల రామలక్ష్మి తదితరులు ఈ కల్యాణంలో పాల్గొన్నారు.

పరవాడ: పరవాడ గ్రామంలో నిర్వహించిన కల్యాణ మహోత్సవంలో ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి శ్రీనివాసరావు, సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు దంపతులు పాల్గొన్నారు. గ్రామ మాజీ సర్పంచ్ పైల అప్పారావు దంపతులు, చుక్క రామునాయుడు దంపతులు, ఉప సర్పంచ్ బండారు రామారావు సీతారాములను దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో భారీ ఎత్తున అన్న సమారాధన నిర్వహించారు.

- వాడచీపురుపల్లి గ్రామంలోని ఆలయంలో కొలువుదీరిన సీతారాములను దర్శించుకునేందుకు వాడచీపురుపల్లి, నాయుడుపాలెం, ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం గ్రామ పంచాయతీల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. కల్యాణ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న పరవాడ మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు దంపతులు సీతారాములకు పట్టు వస్త్రాలను సమర్పించారు. గ్రామ పెద్దలు కూండ్రపు తాతాజీ, కె.ముత్యాల నాయుడు, కె.శ్రీరామ్మూర్తి దంపతులు, కూండ్రపు శ్రీనివాసరావు, కె.శ్రీనివాస్ దర్శించుకుని పూజలు చేశారు. కల్యాణ మహోత్సవాన్ని వేలాది భక్తులు తిలకించారు. అనంతరం భారీ అన్న సమారాధన నిర్వహించారు. రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.
- తానాం గ్రామంలో సీతారాముల కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. సర్పంచ్ కన్నూరి దేవి వెంకటరమణ, ఆర్‌ఈసీఎస్ మాజీ చైర్మన్ పైల జగన్నాధరావు దంపతులు, ఎంపీటీసీ సునీత గోపాలకృష్ణ, ఉప సర్పంచ్ వర్రి మంగలక్ష్మి వసంతరావు, గ్రామ పెద్దలు పైల చంద్ర, రామారావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ.బోనంగి, పి.బోనంగి, రావాడ, పెదముషిడివాడ, కన్నూరు, గొర్లివానిపాలెం, వెన్నలపాలెం, భర్నికం గ్రామాల్లో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని కనులపండువగా జరిపించారు.

సబ్బవరం: మండలంలోని సబ్బవరం, గుల్లేపల్లి, మల్లునాయుడుపాలెం, మొగలిపురం, ఆదిరెడ్డిపాలెం, అసకపల్లి తదితర గ్రామాల్లోని రామాలయాలలో సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు.

- గుల్లేపల్లిలో నిర్వహించిన సీతారాముల కల్యాణోత్సవంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి, రామునాయుడు దంపతులు పాల్గొన్నారు.
- రావలమ్మపాలెం గ్రామంలో కల్యాణోత్సవం అనంతరం నిర్వహించిన అన్నసమారాధనలో సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి, జిల్లా వీఆర్వోల సంఘం అధ్యక్షుడు సబ్బవరపు త్రినాథ రామకాసు, వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద్, మాజీ ఎంపీపీ సబ్బవరపు ముత్యాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.
- ఆదిరెడ్డిపాలెంలో నిర్వహించిన స్వామి వారి కల్యాణంలో వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు కోటాన రాము, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

సింహాచలం: అడవివరంలోని రామాలయాల్లో సీతారాముల కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. రాజవీధి రామాలయంలో సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయస్వామి ఉత్సవమూర్తులను వేదికపై అధిష్ఠింపజేసి, విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం జరిపారు. భక్తులకు పెద్ద ఎత్తున అన్న సమారాధన చేశారు. సింహాచలం దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు గంట్ల శ్రీనుబాబు కల్యాణోత్సవంలో పాల్గొన్నారు.

- సింహగిరిపై ఉన్న కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో సీతారాముల కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. సింహాచలం దేవస్థానం ఈఈ శ్రీనివాసరాజు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.
- 98వ వార్డు సింహపురి కాలనీలోని రామాలయం, అడవివరం కూడలి, విజినిగిరిపాలెంలో ఉన్న రామాలయాల్లో శ్రీరామ నవమి వేడుకలు జరిపారు. పెద్ద ఎత్తున అన్నసమారాధన చేశారు.
- పెందుర్తి మండలం చినముషిడివాడ శాంతినగరంలో ఉన్న రామాలయంలో సీతారాముల కల్యాణం నిర్వహించారు. స్వామిని 97వ వార్డు కార్పొరేటర్ శానాపతి వసంత దంపతులు దర్శించుకున్నారు. అనంతరం అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు.
- అడవివరంలోని విజినిగిరిపాలెం, 93వ వార్డు లక్ష్మీనరసింహనగర్‌లో ఉన్న గోపీజనవల్లభస్వామి ఆలయంలో రాములోరి కల్యాణం చేశారు. పెందుర్తి హరిహర క్షేత్రంలో సీతారాముల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు.



సీతారాములను దర్శించుకుంటున్న పరవాడ ఎంపీపీ వెంకటపద్మలక్ష్మి శ్రీనివాసరావు



వాడచీపురుపల్లిలో కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న మాజీ ఎంపీపీ అప్పలనాయుడు దంపతులు



వాడచీపురుపల్లిలో కల్యాణాన్ని వీక్షిస్తున్న భక్తులు

ముడసర్లోవలో జీ-20 ప్రతినిధుల సందడి

ఆరిలోవ: జీ-20 ప్రతినిధులు ముడసర్లోవ ప్రాంతంలో గురువారం సందడి చేశారు. నగరంలో మూడు రోజులుగా జీ-20 దేశాల సదస్సు జరుగుతున్న విషయం తెలసిందే. ఇందులో భాగంగా మధ్యాహ్నం 3.30 గంటలకు ఆ దేశాల ప్రతినిధులు ముడసర్లోవ రిజర్వాయరులో జీవీఎంసీ నిర్వహిస్తున్న ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్‌ను సందర్శించారు. ముందుగా స్వదేశీ, విదేశీ ప్రతినిధులు ఉన్న బస్ పోలీస్ బందోబస్తుతో బీఆర్‌టీఎస్ రోడ్డులో ఈ ప్లాంట్ వద్దకు చేరుకుంది. దీని కోసం బీఆర్‌టీఎస్‌లో గురువారం ఉదయం నుంచి పోలీసులు అటు హనుమంతవాక నుంచి రామకృష్ణాపురం కూడలి వరకు, ఇటు ఆరిలోవ ఆఖరి బస్ స్టాప్ నుంచి ప్లాంట్ వరకు బందోబస్తు నిర్వహించారు. ప్లాంట్ ఆవరణలో 20 దేశాలకు చెందిన జాతీయ జెండాలను వరుసుగా ఏర్పాటు చేసి ప్రతినిధులకు అధికారులు స్వాగతం పలికారు. సాయంత్రం 4.30 గంటలకు వరకు ఈ ప్లాంట్‌ను పరిశీలించారు. రిజర్వాయరులో ఏర్పాటు చేసిన సోలార్ పలకలను ఆసక్తిగా తిలకించారు. ప్లాంట్ నుంచి ఎంత విద్యుత్ ఉత్పత్తి అవుతుంది.. దాన్ని ఏవిధంగా వినియోగిస్తున్నారు.. తదితర వాటి గురించి అధికారులు ప్రతినిధులకు వివరించారు. రక్షణ చర్యల్లో భాగంగా అధికారులు రిజర్వాయరు ఒడ్డున రెండు బోట్లు, లైఫ్ జాకెట్లు, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచారు. అనంతరం అక్కడి నుంచి మాధవధార బయలుదేరారు.



ముడసర్లోవలో ఏర్పాటు చేసిన జీ-20 దేశాల జాతీయ జెండాలు

జిందాల్ ప్లాంట్ పరిశీలన

మధురవాడ: మధురవాడలో గల జిందాల్ గ్రూప్ వేస్టు టూ ఎనర్జీ ప్లాంట్‌ను గురువారం జి - 20 ప్రతినిధి బృందం సందర్శించింది. 20 దేశాల ప్రతినిధులు జిందాల్ గ్రూప్ మేనేజ్‌మెంట్‌తో మౌలిక సదుపాయాలపై చర్చించారు. ఈ సందర్భంగా స్మిన్ జిందాల్ మాట్లాడుతూ యాక్సిసబుల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, రవాణా, జీవన నాణ్యతను ప్రతినిధులకు వివరించారు. వేస్టు టు ఎనర్జీ రీసైక్లింగ్ ఎనర్జీ ప్లాంట్ వ్యర్థాల నుంచి రోజుకు 15 ఎమ్‌డబ్ల్యూ శక్తి ఉత్పత్తి చేస్తుందని తెలిపారు.



జిందాల్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న జి - 20 ప్రతినిధులు

గాంధీ బజార్‌కు విశేష స్పందన



చెక్కతో తయారు చేసిన బొమ్మలు

పీఎం పాలెం: శిల్పారామం (జాతర)లో ఏర్పాటు చేసిన గాంధీ బజార్ లేపాక్షి హస్తకళల చేనేత ఉత్పత్తుల ఎగ్జిబిసన్ కమ్ స్టాల్స్ వినియోగదారులను ఎంతగానో ఆకర్షిస్తున్నాయి. తయారీ ధరకే వస్తువులను విక్రయించడం ఈ బజారు ప్రత్యేకత. ఈ స్టాల్స్‌లో ప్రదర్శనకు ఉంచిన ఆర్టికల్స్‌లో మేక తోలుపై వేసిన అందమైన పెయింటింగ్స్, ఏటికొప్పాక చెక్కబొమ్మలు, గోగు నారతో తయారు చేసిన సంచులు, బ్యాగులు, చెక్క ఊయల బొమ్మలు, సముద్రపు గవ్వలు, శంకాలతో తయారు చేసిన ఆర్టికల్స్, చేనేత వస్త్రాలు లభిస్తున్నాయి. స్టాల్స్ నిర్వాహకులకు అవసరమైన సదుపాయాలు కల్పించామని స్థానిక పరిపాలన అధికారి విశ్వనాథ రెడ్డి తెలిపారు.

పిచ్చికుక్క స్వైరవిహారం

గోపాలపట్నం: కొత్తపాలెంలో పిచ్చికుక్క స్వైరవిహారంతో పలువురుకి గాయాలయ్యాయి. దాన్ని పట్టుకునేందుకు ప్రయత్నించినా తప్పించుకుంది. ఈ ఘటనతో స్థానికులు బెంబేలెత్తిపోతున్నారు. నాగం అరుణ్ (4), ఎద్దు రామునాయుడును పిచ్చికుక్క గాయపరిచింది. వీరితో పాటు పలువురిని గాయపరిచినట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ పిచ్చికుక్కని అధికారులు పట్టుకోవాలని కోరుతున్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు స్వర్ణ పుష్పార్చనను శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలో వేదికపై అధిష్ఠింపజేసి, 108 స్వర్ణ పుష్పాలతో అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. పూజలో పాల్గొన్న ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకుడు చిన్నా తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కనకరాజు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైభవంగా నిత్య కల్యాణం

శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు శ్రీవరాహ నిత్య కల్యాణం వైభవంగా జరిగింది.



నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కల్యాణ మంపడంలో వేయింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

సిరులతల్లికి సహస్ర తులసిపూజ

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి గురువారం సహస్ర తులసిపూజ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అలాగే పంచామృతాభిషేక సేవలో 12 మంది ఉభయదాతలు పాల్గొన్నారు. పై ప్రత్యేక పూజలో పరోక్ష పద్ధతిలో పాల్గొనే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. రమేష్‌నాయుడు, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఏఈవో వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.



సహస్ర తులసి పూజలో సిరులతల్లి

ప్రైవేటీకరణతో కార్మికుల భవిష్యత్తు అంధకారం



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: ప్రభుత్వరంగ పరిశ్రమలను ప్రైవేట్ పరం చేస్తూ కార్మికుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టే ప్రయత్నాలను కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షల్లో 777వ రోజు గురువారం సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొని, సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మికులకు అన్యాయం చేస్తూ ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ వ్యక్తుల చేతిలోకి ఇస్తే కార్మికులు భవిష్యత్తు ఏంటని ప్రశ్నించారు. కార్మిక చట్టాలను తుంగలోకి తొక్కుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలపై ప్రజల ఆగ్రహంగా ఉన్నారని, రానున్న ఎన్నికల్లో కేంద్ర ప్రభుత్వానికి తగిన గుణపాఠం నేర్పుతామని అన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

దాసరి రాజు జయంతి సందర్భంగా చలివేంద్రం

సింహాచలం: దివంగత వైఎస్సార్‌సీపీ నాయకుడు దాసరి రాజు జయంతిని పురస్కరించుకుని ప్రహ్లాదపురంలోని ఉమామహేశ్వర ఆలయం వద్ద గురువారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. 94వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ఆదిరెడ్డి మురళి చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మజ్జిగ, మంచినీరు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సత్తిబాబు, రాజు, గంగా కృష్ణ, బుడత సూరిబాబు, అప్పలరాజు, పార్వతి పాల్గొన్నారు.



చలివేంద్రంలో మజ్జిగ అందిస్తున్న మురళి, నాయకులు

త్రిఫ్ట్, రిటైర్‌మెంట్ ఫండ్స్‌పై 80 శాతం సెక్యూరిటీ లోన్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ త్రిఫ్ట్ సొసైటీ సభ్యులకు ఉన్న త్రిఫ్ట్ ఫండ్, రిటైర్‌మెంట్ ఫండ్‌పై 80 శాతం సెక్యూరిటీ లోన్‌గా ఇవ్వడానికి మహాజన సభ ఆమోదం తెలిపింది. స్థానిక సెక్టార్-1 స్టీల్‌క్లబ్‌లో జరిగిన త్రిఫ్ట్ సొసైటీ 57వ మహాజన సభలో కార్యదర్శి డి. శ్రీరామ చంద్రమూర్తి చేసిన ప్రతిపాదనకు సభ్యులు ఆమోదం తెలిపారు. సభ్యులకు సూపర్ యాన్యుయేషన్ ఫండ్‌గా ఏటా చెల్లిస్తున్న రూ.750 ను రూ. 850 చేస్తున్నట్టు ప్రకటించారు. కోశాధికారి కొండరాజు 2023-24 వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టగా సభ ఆమోదం తెలిపింది. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు కె. ఆనందకుమార్, డైరెక్టర్లు బి.లాలూ, ఎం.వి. రమణ, కర్రి శ్రీనివాస్, జి.వి. రమేష్, వి.జి. మహిధర్, సొసైటీ సీనియర్ మేనేజర్ కె. దామోదరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బుద్ధుడి విగ్రహం ఏర్పాటుకు చర్యలు

గోపాలపట్నం: మర్రిపాలెం వుడా లేఅవుట్ గ్రీన్ బెల్టు వాకింగ్ ట్రాక్‌లో బుద్ధుని విగ్రహం ఏర్పాటు పనులు చురుగ్గా సాగుతున్నాయి. టైల్స్ అమర్చి విగ్రహాన్ని అందంగా తీర్చిదిద్ది, త్వరలో ప్రారంభిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ విగ్రహం ఏర్పాటు విషయమై స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సీతంపేటలో మెగా పోస్టల్ మేళా

సీతంపేట: అక్కయ్యపాలెం సబ్ పోస్టాఫీస్ సిబ్బంది ఆధ్వర్యంలో గురువారం సీతంపేట దుర్గాగణపతి ఆలయం వద్ద పోస్టల్ మెగా మేళా నిర్వహించారు. 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ మేళాను ప్రారంభించి మాట్లాడారు. తపాలా శాఖ అనేక రకాల పొదుపు పథకాలను అందజేస్తోందన్నారు. ఆర్‌డీ, డిపాజిట్లు, లైఫ్ ఇన్సూరెన్స్, సుకన్య సమృద్ధి పథకాల్లో ప్రజలు మదుపు చేసి అధిక లాభాలు, మీ డబ్బుకు పూర్తి రక్షణ పొందవచ్చని చెప్పారు. పోస్ట్‌మాస్టర్ ఏసు మాట్లాడుతూ పోస్టాఫీస్‌లో గాని, మీ ఇంటికి ఉత్తరాలు బట్వాడా చేసే పోస్ట్‌మ్యాన్, ఉమెన్ ద్వారా ఇంటి వద్దే డబ్బు చెల్లించి పోస్టల్ పథకాల్లో డిపాజిట్ చేయవచ్చని తెలిపారు. పోస్టల్ శాఖ అందిస్తున్న పలు పొదుపు పథకాలు, వాటి ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమాన్ని వెస్ట్ సబ్ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ పర్యవేక్షించారు. అక్కయ్యపాలెం సబ్ పోస్టాఫీస్ సిబ్బంది, పోస్ట్‌మ్యాన్‌లు, పోస్ట్ ఉమెన్‌లు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ కార్యాలయం, సరిపల్లి

రేఖా నెం. 02/2023   తేది. 30-03-2023

విశాఖపట్నం జిల్లా, పెందుర్తి మండలం, సరిపల్లి గ్రామపంచాయతీలో తే 31-03-2023దిన జరగవలసి ఉన్న టెండర్లు అనివార్య కారణముల వలన వాయిదా వేయడమైనది. టెండరు తేదీని మరలా పేపరు ప్రకటన ద్వారా యావన్మందికి తెలియజేయగలవారము.

వి.నాగ శ్రీ సాయిష్
గ్రామపంచాయతీ కార్యదర్శి
సరిపల్లి, పెందుర్తి మండలం, విశాఖపట్నం జిల్లా